ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



భక్తులతో కిటకిటలాడిన బిర్లామందిర్



కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా వద్ద.. నగర సీపీ, ఇతర ఉన్నతాధికారులు

చార్మినార్: పాతబస్తీ ప్రజలు నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో చార్మినార్ కట్టడం సందర్శకులకు కనువిందు చేసింది. తెల్లవారు జాము వరకు యువకులు, మహిళలు, చిన్న, పెద్ద అన్న తారతమ్యం లేకుండా వీధుల్లో నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. కొందరు కుటుంబ సభ్యులతో కలిసి కేక్‌లు కట్‌చేస్తూ స్నేహితులు, బంధువులకు పంచిపెట్టారు. మహిళలు కొత్త సంవత్సరం సందర్భంగా రంగురంగుల ముగ్గులను వేస్తూ అర్ధరాత్రి నుంచే తమ ఇళ్ల ముంగిట్లో సందడి చేశారు. కొత్త సంవత్సరంలో సోమవారం మొదటి రోజు కావడంతో పాతబస్తీలోని ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. స్నేహితులు, బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలు బిజీబిజీగా గడిపారు.

పాతబస్తీలో 116 డీడీ కేసుల నమోదు..

చార్మినార్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ కాటం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 10 నుంచి సోమవారం తెల్లవారు జామున 4 గంటల వరకు చార్మినార్, మీర్‌చౌక్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా తదితర నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని కీలకమైన చౌరస్తాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ (డీడీ) నిర్వహించి దాదాపు 116 కేసులు నమోదు చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పాతబస్తీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దక్షిణ మండలం పోలీసులు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. చార్మినార్, మక్కా మసీదు తదితర కట్టడాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేసారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్ఏఎఫ్) బలగాలు శాంతి భద్రతలను పర్యవేక్షించాయి.

కిక్కిరిసిన ఆలయాలు

అబిడ్స్: నూతన సంవత్సర సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. బిర్లామందిర్‌కు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో కిక్కిరిసి పోయింది. వేలాది మంది భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి వచ్చారు. భక్తులతో ఆలయం సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

రంగనాథ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



జియాగూడ: జియాగూడలోని రంగనాథస్వామి ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని రంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రతినిధి శేషాచార్యులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

నూతన సంవత్సర వేడుకల్లో నగర పోలీస్ కమిషనర్

సుల్తాన్‌బజార్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కోఠి ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా వద్ద సోమవారం తెల్లవారుజామున నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కేక్‌ను కట్‌చేసి మూడు రంగుల బెలూన్స్ ఎగరవేసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. పోలీసు అధికారులతో పాటు సిబ్బందికి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, జాయింట్ కమిషనర్‌లు ఏవీ రంగనాథ్, సత్యనారాయణ, ఈస్ట్‌జోన్ డీసీపీ సునిల్‌దత్, అడిషనల్ డీసీపీ పృథ్వీధర్, సుల్తాన్‌బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి, సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కొండపల్లి ముత్తుతో పాటు ఈస్ట్‌జోన్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ కోశాధికారిగా ఉదయ్ భాస్కర్



సరాబు ఉదయ్ భాస్కర్‌గుప్తాను సన్మానిస్తున్న సభ్యులు

గౌలిపురా: హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ కోశాధికారిగా పాతబస్తీకి చెందిన ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్ గుప్తా కుమారుడు సరాబు ఉదయ్ భాస్కర్‌గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖైరతాబాద్ వైశ్య భవన్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా సరేశ్, కార్యదర్శిగా నాగార్జున్, కోశాధికారి సరాబు ఉదయ్ భాస్కర్ గుప్తాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ కమిటీ చైర్మన్ శేరి వెంకటేశ్ ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



గోల్కొండ కోట వద్ద గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండ కోట చౌరస్తా వద్ద నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహిత హైదరాబాద్‌గా మార్చడమే పోలీసుల లక్ష్యమన్నారు. మాదకద్రవ్యాల సేవణం, అక్రమ రవాణాతో పాటు వాటి అమ్మకం దారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబిద్, ఇలియాస్ ఆలీ, పరమానందం, ఆజామ్‌ఖాన్ తదితరులున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



చార్మినార్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి సోమవారం సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలీ మస్కతి మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలన్నారు.

గవర్నర్‌కు..



గౌలిపురా: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి, లాల్‌దర్వాజా మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ సోమవారం రాజ్‌భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా గవర్నర్‌ను వెంకటేశ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

డాక్టర్ నాగేందర్‌కు ..



అఫ్జల్‌గంజ్: నూతన సంవత్సర వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌కు ఆర్ఎంఓ డాక్టర్ ఎండీ రఫీ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీ జ్ఞాన వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకొని శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. 41 రోజుల దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు 40 మంది శబరియాత్రకు తరలివెళ్లారు. ఉదయం దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అయ్యప్ప స్వామి ఇరుముడులు కట్టుకోని స్వామి వారి దర్శనానికి పయణమైయ్యారు. ఈ సందర్భంగా ఇరుముడులు కట్టుకున్న స్వాములకు జ్ఞాన వెంకటేశ్వర స్వామి కమిటి సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ పూజల్లో ఆలయ కమిటి అధ్యక్షులు రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు తలారి ప్రేమ్‌కుమార్, నరేందర్ గురుస్వామి, సుధాకర్ గురుస్వామి, తలారి రమేష్, నవీన్ గురుస్వామి, రాజశేఖర్, ఆలయ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 57 మందిపై కేసులు నమోదు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 31 డిసెంబర్‌ను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున వరకు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 57 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బోసు వెల్లడించారు. 31 డిసెంబర్‌ను పురస్కరించుకొని రాత్రి 10 గంటల నుంచి ఆరాంఘర్ చౌరస్తా, కాటేదాన్, ఈశ్వర్ థియేటర్, మోయినాబాద్ ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్‌లను ఏర్పాటు చేశామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో మొత్తం 57 మంది మద్యం తాగి వాహనాలను నడిపించినట్టు గుర్తించామన్నారు. వారందరిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ పోలీసులతో ఏర్పాటు చేసిన బందోబస్తు కారణంగా ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడలేదన్నారు. అలాగే ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు చర్యలను చేపట్టామన్నారు.

నార్సింగి పరిధిలో 81 మంది పై..

మణికొండ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై నార్సింగి పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్, నార్సింగి, కోకాపేట తదితర ప్రాంతాలలో ఆదివారం రాత్రి 8 గంటల నుంచి వాహనాల తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా 81 మంది పై కేసులు నమోదు చేశారు. వారందరినీ త్వరలోనే కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ పటిష్టతకు కృషి



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను పటిష్ట పర్చేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకులు, గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నెంబర్-1 స్థాయిలో ఉండే విధంగా బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామని గోషామహల్ అసెంబ్లీ నుంచి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే భారీ ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు.

యువ కార్టూనిస్టులను ప్రోత్సహించిన బీవీ.సత్యమూర్తి



తెలుగు ఫాంట్‌ను ఆవిష్కరిస్తున్న పలువురు సాహితీవేత్తలు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ కార్టూనిస్టు బీవీ.సత్యమూర్తి ఎంతో మంది యువ కార్టూనిస్టులను ప్రోత్సహించారని దూరదర్శన్ పూర్వ అడిషనల్ డీజీ డాక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు బీవీ.సత్యమూర్తి 85వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యమూర్తి తెలుగు ఫాంట్‌ను ఆవిష్కరించడంతో పాటు కార్టూన్ బ్రహ్మ అనే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి డిజైనింగ్ స్టూడియో సంచాలకులుగా కార్టూనిస్టులకు ఎన్నో వర్క్‌షాప్స్ నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు, సెన్సార్ బోర్డు సభ్యులు కళారత్న బిక్కి ఆకాశవాని విశ్రాంత తెలుగు న్యూస్ రీడర్ కందుకూరి సూర్యనారాయణ, సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తదితరులు

డబీర్‌పురా: రెయిన్‌బజార్, భవానీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో అదనపు పోలీసు బలగాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఉమర్ ఫారూఖ్ శ్మశాన వాటిక, ఆటో స్టాండ్ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలు, గంజాయి, వైట్నర్ ఇతర మత్తు పదార్థాలు విక్రయాలు జరుగుతున్నాయా..సేవిస్తున్నారా.. అంటూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవీందర్, రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోమటివాడిలోని రామాలయానికి చేరుకున్న శ్రీరామ పాదుకలు





డబీర్‌పురా: అంజనాద్రి నుంచి ఉభయ జగద్గురుల ఆధ్వర్యంలో బయలుదేరిన శ్రీరామ పాదుకలు సోమవారం డబీర్‌పురా కోమటివాడిలోని రామాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీరామ పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరిగి తీసుకెళ్లారు. శ్రీరామ పాదుకలకు ఆలయ పూజారి బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండేళ్ల పాటు దయానంద సరస్వతి జయంత్యుత్సవాలు



సమావేశంలో ఆర్యసమాజ్ ప్రతినిధులను సన్మానిస్తున్న డాక్టర్ ధర్మతే తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల పాటు దయానంద్ సరస్వతి జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వ నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ ధరమ్‌తేజ్ తెలిపారు. సోమవారం సుల్తాన్‌బజార్ కందస్వామి లేన్‌లోని ఆర్యకన్య పాఠశాలలో సన్నాహాయ సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ ధర్మతేజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణలోని వివిధ జిల్లాల ఆర్యసమాజ ప్రముఖులు, గురుకులాల ఆచార్యులు పాల్గొని పలు నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో నిజాం రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన ఆర్య సత్యాగ్రహ ఉద్యమంలో అమరులైన వారి స్మారకార్థం భవనాన్ని నిర్మించి ఉద్యమంలో ఆర్యసమాజ్ పాత్రపై పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయుట.. ఇంటింటా యజ్ఞ కార్యక్రమాలు, దళితవాడల్లో సామూహిక యజ్ఞాలు, 200 విద్యాలయాల్లో మహర్షి దయానందుని జీవిత చరిత్రపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించుట, ఫిబ్రవరి 4న హైదరాబాద్‌లో మహర్షి దయానంద్ సరస్వతి జయంతి ఊరేగింపు, బహిరంగ నిర్వహించాలని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మలానంద యోగ భారతి, ఆచార్య నరేంద్ర, ప్రభాకర శర్మ, డాక్టర్ శ్యామ్ ప్రసాద్, డాక్టర్ విద్యాధర సోమ్‌నాథ్, ధరమ్‌పాల్, నందన కృపాకర్ పాల్గొన్నారు.

రాములోరి అక్షింతలకు ప్రత్యేక పూజలు



రాములోరి అక్షింతల కార్యక్రమంలో సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: శ్రీ రాములవారి అక్షింతలు గోల్కొండకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గోల్కొండ బాజారి దర్వాజ, రిసాలబజార్ తదితర ప్రాంతాల్లో సోమవారం అక్షింతల కలశాల ఊరేగింపు జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీ వీరభద్ర స్వామి, విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

22న ఇంటింటా అయోధ్య సంబరాలు



అయోధ్య అక్షింతలు పంపిణీ చేసిన కొల్లూరు పవన్‌కుమార్ తదితరులు

అబిడ్స్: జనవరి 22న ప్రతి ఇంటా దీపాలు వెలిగించి అయోధ్య సంబరాలు చేపడుతామని నగర బీజేపీ నాయకుడు, నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్ పేర్కొన్నారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను ఆగాపురా, బోయిగూడ కమాన్, డి క్లాస్, సీతారామ్‌బాగ్ ప్రాంతల్లో ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. అనంతరం కొల్లూరు పవన్‌కుమార్ మాట్లాడుతూ.. 22న ప్రతి ఇంట్లో సాయంత్రం వేళ దీపాలు వెలిగించి అయోధ్య సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. ప్రతిరోజూ అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తామన్నారు.

నోరూరిస్తున్న నహరీ పాయా!

- చలికాలంలో ఆరోగ్యానికి మేలు
- కిక్కిరిసిపోతున్న హోటళ్లు
- బారులుదీరుతున్న నగరవాసులు





నహరీ పాయా అమ్మకాలు

గోల్కొండ: వివిధ రకాల వంటకాలకు హైదరాబాద్ పెట్టింది పేరు. మొగలాయి వంటకాలతో పాటు హైదరాబాదీ వంటకాలకూ మంచి డిమాండ్ ఉంది. సీజన్‌లకు అనుగుణంగా నగరంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలలో నోరూరించే వంటకాలు సిద్ధంగా ఉంటాయి. అయితే.. కొన్ని హోటళ్లలో మాత్రం చలికాలం వచ్చిందంటే చాలు కిక్కిరిసిపోతాయి. నహరీ-పాయా తినేందుకు అయా హోటళ్ల వద్ద బారులుతీరుతారు. ఈ వంటకం ఆరోగ్యంతో పాటు రుచికరంగా ఉంటంది. దీన్ని ఇష్టపడని వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కేవలం ఉదయం, రాత్రి పూట అదీ చలికాలంలో మాత్రమే ఈ డిష్ లభిస్తుంది. కీళ్ల నొప్పులతో పాటు ఎముకల ఫ్యాక్చర్‌తో బాధపడుతున్న వారు నహరీ పాయాను తీసుకుంటారు. నహరీ పాయాతో పాటు నాన్‌కీ రోటీ తీసుకోవడం హైదరాబాద్‌లో శతాబ్దాల నుంచి కొనసాగుతుంది. ఒకప్పుడు కేవలం సంపన్నులకే అందుబాటులో ఉండే నహరీ పాయా నేడు పేద ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుంది.

తయారీ విధానం..

గొర్రె, పొటేళ్ల కాళ్లను కట్టెలమంటపై కాల్చడం పాయా ప్రత్యేకత. బాగా కాల్చి పాయాకు శుభ్రం చేసి ఉడకబెడతారు. దాల్చిని చెక్క, నల్ల మిరియాలు, పోట్లీకా మసాలా లాంటి పదార్థాలతో సూప్ తయారు చేస్తారు. ఈ సూప్ తయారీ కనీసం గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది. ఈ విధంగా సిద్ధం చేసిన సూప్‌ను కొత్తిమీరాతో గార్నీష్ చేసి పెద్ద పాత్రలో వేసి అందులో ఉడికించి పెట్టిన పాయాను వేస్తారు. మసాలా దినుసులతో తయారైన పాయా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. అదే విధంగా పాయా సైతం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాగా నహరీ పాయాను వేడివేడి నాన్‌కీ రోటీతో తింటారు. మరి కొందరు కేవలం నహరీతో నాన్ రోటీ తింటారు.

ఆరోగ్యానికి మేలు చేకూరుస్తోంది..



మా తాతా కాలం నుంచి నహరీ తింటాం. ముఖ్యంగా చలికాలంలో నహరీలో నాన్‌కి రోటీ నంచుకోని తింటే ఎంతో రుచికరంగా ఉంటుంది. చిన్న పిల్లలకు సైతం నహరీ పాయాను బ్రేక్‌ఫాస్ట్‌లో ఇస్తుంటాం. కాలం మారుతున్న కూడా నహరీ పాయాకు ఆదరణ తగ్గలేదు. – ఎస్.జగన్నాథం, హకీంపేట్

షేక్‌పేట్‌లో ఉచిత వాటర్ క్యాంప్



ఉచిత వాటర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ తదితరులు

గోల్కొండ: ప్రజా పాలన సభ కేంద్రాల వద్ద ఉచిత తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నామని షేక్‌పేట్ జలమండలి డీజీఎం ఖాజా జవహర్‌అలీ అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్ బీజేఆర్ కమ్యూనిటీహాల్ వద్ద ఉచిత తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం కోసం వచ్చే ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సదానంద్, రమేష్, ముజీబ్ తదితరులున్నారు.

అసోసియేట్ ఎడిటర్‌గా ప్రొ. గణపతి వైతీశ్వరన్

రాయదుర్గం: బులెటిన్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్‌కు అసోసియేట్ ఎడిటర్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గణపతి వైతీశ్వరన్‌ను ఆహ్వానించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లో ప్రొఫెసర్ అయిన గణపతి వైతీశ్వరన్ 2024 జనవరి నుంచి డిసెంబర్ 2026 వరకు ఎడిటోరియల్ బోర్డ్‌లో అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేస్తారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



క్రిస్మస్ గిఫ్ట్ అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: అన్ని వర్గాల ప్రజల మద్దతుతో మజ్లిస్ పార్టీ ముందుకు సాగుతుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన సాలార్‌జంగ్ కాలనీలోని సెయింట్ మైకెల్స్ చర్చిలో క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు మద్దతుగా ఉండే పార్టీ మజ్లిస్ ఒక్కటేనన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, సెయింట్ మైకెల్స్ చర్చి ఫాదర్ శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

వాల్మీకి సంఘం కేలండర్ ఆవిష్కరణ

మణికొండ: మహర్షి బోయ వాల్మీకి సంఘం 2024 సంవత్సరం కేలండర్‌ను మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి కలిసి రావాలని, అనుకున్న పనులు పూర్తి కావాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కె. లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిండెట్ కిరణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, బి. సాయిరెడ్డి, మహేశ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వాల్మీకి సంఘం అధ్యక్షుడు టీ. శ్రీనివాస్ పాల్గొన్నారు.